# కామేశ్వరి కల

## -దర్భా లక్ష్మీ అన్నపూర్ణ

కామేశ్వరికి ఈమధ్య జీవితం అంటే విసుగ్గా అనిపిస్తున్నట్లుగా అనుమానం వస్తోంది. ఆ అనుమానం ఆమెకి భయాన్ని కూడా కలిగిస్తోంది. మానవ జన్మ ఎంతో విలువైనదీ, అపూర్వమైనదీను. దానిలో ప్రతి క్షణాన్నీ మనసారా ఆస్వాదించాలనీ, అనుభూతి చెందాలనీ... నిజానికి కామేశ్వరి ప్రగాఢ నమ్మకం.

అదే నిజానికి సత్యం కూడాను మరి. అందుకే అమ్మో... జీవితం అంటే విసుగొచ్చేస్తే ఎలాగ- వీల్లేదు కాక వీల్లేదు అనుకుని అందుకు కారణాలేమిటబ్బా అని అన్వేషించసాగింది. అసలు తను ఈ మధ్యన ఎలా వుంటోందీ అన్న విషయం గుర్తుకు తెచ్చుకోసాగింది.ఈమధ్య తను చాలా చాలా ఆనందంగా రోజులు గడపడంలేదేమోనన్న భావన కలిగింది. కలిగిందే తడవుగా తన గత రెండునెలల కాలపు చిట్టాని రివైండ్ చేసి చూసుకోవడం మొదలుపెట్టింది మనోనేత్రంలో.

ఊహూ... ఎక్కడా ఆనందంతో పొంగిపోయిన క్షణాలు కనిపించడంలేదు కామేశ్వరికి. ఎప్పుడో అడపాదడపా స్నేహితుల ఇంటికి వెళ్లి ముక్తసరిగా కబుర్లు చెప్పుకుని వచ్చేయడం తప్ప తను అత్యంత ఉత్సాహంతో కలియ తిరిగేసిన సందర్భాలేం కనిపించడంలేదు. దాంతో తనలో ఈమధ్య ఉత్సాహం తగ్గిపోయిందన్న విషయం కామేశ్వరికి నిర్ధారణ అయింది. అలా నిర్ధారణ జరిగిపోగానే ఎందుకు అన్న ప్రశ్న ఉదయించింది.

ఆలోచించగా ఆలోచించగా కామేశ్వరికి ఎప్పుడో ఎక్కడో విన్న ఓ మాట జ్ఞాపకం వచ్చింది.

మనిషికి లక్ష్యమూ, ఆశయమూ లేకపోతే జీవితం ఆగిపోయినట్టుగానో, మందకొడిగా సాగుతున్నట్లుగానో అనిపిస్తుందిట. ఈ ఆలోచన రాగానే తనకి ఏ టార్గెట్టు అంటే లక్ష్యము లేదు అన్న ప్రశ్నని వేసుకుని తనకు తాను పరిశీలించుకోసాగింది. ప్రస్తుతానికంటూ ఏవీ లేనట్టుగానే జవాబు వచ్చింది.

వెంటనే తనకి పరిచయంవున్న కొంతమంది ఆడవాళ్ల గురించి ఆలోచించడం మొదలుపెట్టింది. వాళ్లు కబుర్లలోని ధోరణిని గుర్తు చేసుకుంది. ఒకరికి పక్కవారిని దుమ్మెత్తిపోయడమే ధ్యేయంగా ఉంటే, ఇంకొకరికి పక్కవారిని వెనుక నుంచి దెబ్బ తీయడమే ధ్యేయమన్నట్లుగా ఉన్న వాళ్లు ఉన్నారు.

అటువంటి ధ్యేయాలు మాత్రం తనకి వద్దు బాబోయ్ అనిపించింది కామేశ్వరికి. అసలు అటువంటి లక్షణాలని ధ్యేయాలనడం కూడా తప్పవుతుందేమో!

తను జీవితం ఉత్సాహంగా సాగిపోవడానికి ఎటువంటి లక్ష్యం పెట్టుకోవాలా అని ఆలోచిస్తూ దిగులుగా కూర్చుంది. పిల్లల టార్గెట్లు తన జీవితంలో ఓ భాగంగానే అనిపిస్తున్నాయిగానీ పూర్తిగా తనవిగా తృప్తిగా అన్పించడంలేదు. పిల్లల విజయాలు తన విజయంకన్నా తృప్తి కలిగించే మాట నిజమే అయినా తనకంటూ ఏదయినా విజయం, ఆనందం వుంటే బావుండునని పిస్తోంది. తన భర్త లక్ష్యాల గురించి, విజయాల గురించి ఆలోచించినా అలాగే అనిపిస్తోంది.

★★★

ఇంటికొచ్చేసరికి నాలుగు వీశెల నూనె త్రాగి ఓ వంద కిలోల బరువు మోస్తున్నట్లుగా మొహం పెట్టుకుని కూర్చున్న భార్యను చూసి ఖంగుతిన్నాడు పరాంకుశం. ఎందుకంటే కామేశ్వరి అలా కూర్చోవడం అరుదు కనుక.

"ఏం జరిగింది కాముడూ?" పరాంకుశం కూడా చాలా విచారంగా అడిగాడు.

ఇంకొంచెం విచారాన్ని వదనంలోకి జొప్పించి అంది కామేశ్వరి "నేనీ మధ్య చాలా డల్‌గా అయిపోయాను కదండీ. అందుకని విచారంగా ఉంది"

"ఆ.." పరాంకుశం ఆశ్చర్యంతో పరాకులోకి వెళ్లిపోయాడు క్షణంసేపు. అందుకోసం ఇంత విచారమా? కాముడింత విచారంగా మొహం పెట్టేస్తే ఆవిడగారు అమితంగా ప్రేమించే తొంభై ఏళ్ల బామ్మ ఏమయినా పరలోకానికి చిత్తగించేసిందేమోనని భయపడ్డాడు పరాంకుశం. కామేశ్వరి చురుకయిందన్న మాట నిజమేగానీ డల్‌గా అయిపోయానని ఇంతలా నూనె తాగిన మొహం పెట్టేసుకోవాలా?

"డల్‌గా అయిపోయానని అనుమానం వస్తే ఛెంగున లేచి చలాకీగా లేచి చలాకీగా గంతులెయ్యడం మొదలుపెట్టాలిగానీ ఇదేమిటి నీ తెలివి తెల్లారా?" అన్నాడు పరాంకుశం భార్యని పలుచన చేస్తున్నట్లుగా.

పరాంకుశం అన్న చివరి మాటకి చివాలున తిరిగి చూడాలని అనుకుందిగానీ అందుక్కూడా బద్ధకంగా అనిపించింది కామేశ్వరికి.

"కారణం తెలిస్తేనేగదా పరిష్కారం దొరికేది? అందుకే శోధిస్తున్నా? దేన్నికైనా బాధంటూ పడకపోతే ప్రక్షాళన జరగదు."

భార్యామణి మాటలకు ఓ నిట్టూర్పు విడిచాడు పరాంకుశం. కాఫీ తానే కలుపుకుని టీవీ ముందు కూలబడ్డాడు. కావుడికేం వచ్చినా పట్టలేం అన్నది పరాంకుశం ప్రగాఢమైన అభిప్రాయం.

ఇంతలో కాలేజీ నుంచి వచ్చిన కూతురు కైలాస తల్లియొక్క వాడిపోయి వాలిపోయిన మొక్కలాంటి ఫోజు చూసి నుదురు చిట్లించింది ప్రశ్నార్థకంగా.


కూతురి సందేహాత్మక దృక్కులని అర్థం చేసుకున్న పరాంకుశం అన్నాడు "మీ అమ్మ ఈ మధ్యన చాలా డల్ అయిపోయిందిట. పైగా ఆ విషయం తనంతట తనే తెలుసుకుందిట. ఇప్పుడు కారణాలు శోధిస్తోంది. మ్యాచింగ్‌గా

వుంటుందని ఆ ఫోజులో సెటిలైపోయింది'' తను వెంటనే ఇదంతా చెప్పకపోతే టీవీ లైవ్‌షోలో యాంకర్‌లా ప్రశ్నల సీక్వెన్స్‌తో దాడి చేస్తుందని భయం.

ఎందుకంటే కైలాస యాంబిషన్ టీవీలో ఏదయినా లైవ్ షోకి యాంకరింగ్ చేయాలని. అందుకని స్పాంటేనియస్‌గా అంటే అప్పటికప్పుడు ఆలోచించి ప్రశ్నలు వేయడాన్ని, మాటల మూటల్ని చకచకా కట్టేయడాన్ని, విప్పేయడాన్ని తెగ ప్రాక్టీస్ చేయడం ఎప్పుడో మొదలుపెట్టేసింది.

చివాలున తల్లి పక్కకి వచ్చి కూర్చుని తక్కున సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లుగా భంగిమ పెట్టేసింది.

ఉలిక్కిపడిన కామేశ్వరి కూతురివైపు చూసి క్షణాల్లో తనలో ఒక నమ్మకాన్ని పెంచుకుంది తన పుత్రికా రత్నం తన సమస్యకి పరిష్కారం తప్పకుండా చెబుతుందని. 'నువ్వే శరణు' అన్నట్లు కూతురి భుజంమీద వాలిపోయింది.



తల్లి ఆ చర్యకి తనూ ప్రతిస్పందిస్తూ "భయపడకు మాతా!'' అని అభయం ఇస్తూ తల్లి వీపు మీద సున్నితంగా తట్టి ధైర్యం చెప్పింది కైలాస.

"భయపడకు మాతా అనకూడదు ఈ పరిస్థితిలో. దిగులు పడకు మాతా అనాలి. యాంకరింగ్ చేయాలంటే మాటేకాదు, ఎదుటివాడి మనసూ వినాలి'' క్షణంసేపు తన బాధ సంగతి మర్చిపోయి కూతురికి ఉపదేశం చేసింది కామేశ్వరి. అయిదు నిముషాల ఆలోచన తరువాత ఉత్సాహంగా సోఫాలోంచి లేచి ఓ బ్రహ్మాండమైన సత్యం చెబుతున్నట్లుగా భంగిమ పెడుతూ అంది కైలాస-

"జీవితం పరుగులుతీస్తూ ఉండాలంటే మనిషి ముందు కలలు కనడం అలవాటు చేసుకోవాలి. ఆ కలని నిజం చేసుకోవాలన్న తపన మనస్సుకి ఉత్తేజాన్నిస్తుంది. ఆ కల కోసం కష్టపడడంలో జీవితం పరుగులు తీస్తూ ఉంటుంది నయాగరా జలపాతానికి ఉండే వేగంతో.''

ప్రతి నిముషం ఏదో మాట్లాడుతూ ఉండడమే జీవితం అనుకున్నట్లుగా ఉండే కూతురు ఇంత చక్కటి మాట చెప్పడం ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ కూడా అనిపించింది.

"ఈ సంభాషణ ఎక్కడో విన్నట్లుగా ఉందే'' పరాంకుశం ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు.

"అదే నాన్నా! మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారు చెప్పారు. నా సొంతం ఏం కాదులే'' ఆ మాట తనది కానందుకు కాస్తంత విచార వదనంతో అంది కైలాస.

"అంతటి గొప్పవాళ్ల భాషణల్ని గుర్తుపెట్టుకోవడమే సొంతంగా చెప్పినంత గొప్ప లేరా బుజ్జీ'' కూతురి భుజం తట్టాడు పరాంకుశం.

"కలలు కనండి. వాటిని సాకారం చేసుకోండి అన్నారాయన.''

కూతురి మాటతో మంత్రం వేసినట్లుగా విచార భంగిమలోంచి బయటకు వచ్చేసింది కామేశ్వరి.

కళ్లల్లో మెరుపులు మెరుస్తుండగా అంది "కొంచెం వివరంగా చెప్పు'' అంటూ ఇంకా ఏదో అనేంతలో పరాంకుశం పెద్దపెట్టున పకాలుమని నవ్వడం మొదలుపెట్టాడు. హఠాత్తుగా అంతగా ఎందుకు నవ్వేస్తున్నాడో అర్థంకాని అక్కడి వాళ్లిద్దరూ తెల్లముఖం వేసారు.

వాళ్ల సందేహం తీరుస్తున్నట్లుగా అన్నాడు పరాంకుశం "మీ అమ్మకి కలలేమిటే పిచ్చితల్లీ.

కలాంగారు చెప్పింది మీ అమ్మలాంటి వాళ్లకోసంకాదు. దేశంలోని భావి భారత పౌరుల కోసం. అయితే గియితే మాలాంటి మగాళ్ల కోసమూను.''

కూతురి మాటతో ఎంతో ఆశతో కళ్లల్లో మెరుపుల్ని నింపుకున్న కామేశ్వరి కళ్లల్లోకి మబ్బుల గుంపులు వచ్చి చేరిపోయాయి.

"పిల్లలకీ, యువతకీ అంటే ముందు ముందు బోలెడు జీవితం ఉంటుంది. మీ అమ్మకింకేం వుంది. వంట చేసి పెట్టడం, గిన్నెలు కడుక్కోవడం, బట్టలు ఉతకడంతప్ప! మహా అయితే మంచి పనిమనిషి దొరకాలన్నది మీ అమ్మ కలయి వుంటుంది'' అని మళ్లీ నవ్వడం మొదలుపెట్టాడు.

"పక్కింటావిడకన్నా పెద్ద గొలుసు కొనుక్కోవాలన్నది మీ అమ్మ కలయి ఉంటుంది. కలగనడం సులభమే. తీర్చే శక్తి నాకుండి చావొద్దూ'' కామేశ్వరి కలల ప్రపంచం అంతా తనపైనే ఆధారపడినట్లుగా అన్నాడు మళ్లీ పరాంకుశం.


## చనిపోయినవానికి విడుదల

రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాకి చెందిన గీగ్‌సింగ్ ఒక హత్య కేసులో డిసెంబరు 2000లో జైలుకెళ్ళాడు. కోర్టువారు జూన్ 2002లో అతనికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తే అతన్ని జోధ్‌పూర్ జైల్లో ఉంచారు. అయితే, అతనికి మతిస్థిరం లేదని జైలు శిక్ష తొలగించాల్సిందని మెడికల్ రిపోర్టు ఆధారంతో అతని బంధువులు హైకోర్టుకి అప్పీలు చేసారు. విచారణకి వచ్చిన ఆ కేసుని పరిశీలించి మతిస్థిరం లేని వాళ్ళకి ఐపిసి సెక్షను 84 క్రింద జైలు శిక్ష విధించరాదని అతన్ని విడుదల చేయాల్సిందిగా హైకోర్టు తీర్పునిచ్చింది. జోధ్‌పూర్ జైలువారికి ఆ విషయం తెలియజేస్తే గీగ్‌సింగ్ ఆగష్టు 2003లోనే అంటే నాలుగేళ్లక్రితమే చనిపోయాడని, ఆ సంగతిని లోయరు కోర్టువారికి తెలియజేసామని చల్లగా చెప్పారు.

## తరిగిపోతున్న తెల్లవాళ్ళు

అమెరికాలో 2005లో 29.6 కోట్ల జనాభాలో 82 శాతంమంది తెల్లవారట. అయితే వలస వచ్చిన ఆసియా, ఆఫ్రికా వాసుల జనాభా పెరిగి 2050 నాటికి దేశజనాభా 43.8 కోట్లు చేరితే దానిలో తెల్లవాళ్ళు కేవలం 47శాతం మాత్రమే ఉండగా ఆసియా వాళ్ళ జనాభా రెట్టింపు అవుతుందిట. దీంతో భవిష్యత్తులో అమెరికాలో తెల్లవాళ్ళు మైనారిటీలవుతారని అధికారులు అంటున్నారు.

-విమలారామం




అతని మాటలు కామేశ్వరి మనస్సుని చిన్నబుచ్చుకునేలా చేసాయి. తను ఈమధ్యన స్తబ్దుగా అయిపోయినందుకు బాధపడుతోందన్న విషయాన్ని మర్చిపోయింది కామేశ్వరి. పతిదేవుడు చెబుతున్న తన కోరికల లిస్టు వింటుంటే నిజంగా అంతేనా అన్న అనుమానం రాసాగింది.

"అయినా దేనికోసం అయినా కలగంటూ కూర్చోవల్సిన అవసరం ఏం వుంది మీ అమ్మకు. మనస్సులోకి ఆలోచన రాగానే నాకో డిమాండ్ పారేస్తే సరి. అవి తీర్చడానికి నేను కలలుగని శక్తి తెచ్చుకోవాలి పని చేయడానికి.''

"కలకీ, ఆలోచనకీ తేడా ఏమిటి నాన్నా?''

"ముందుగా ఏదయినా కావాలన్న ఆలోచన మొదలవుతుంది. అది క్షణాలు గడిచేకొద్దీ కోరికగా మారుతుంది. ఆ కోరిక తీరడం ఆలస్యం అయినకొద్దీ అది కలగా మారడం జరుగుతుంది.''

"నువ్వు అమ్మని దృష్టిలో పెట్టుకుని చెప్పిన్నట్లున్నావు?'' తనలో తను గొణుక్కుంటున్నట్లుగా అనుకుంది కైలాస.

కామేశ్వరికి పరాంకుశం మాటలు పరాచికంలా కాకుండా పచ్చి ముల్లులా అనిపించాయి. ఏవేవో కొత్త కొత్త ఆలోచనలు మనసుని రకరకాలుగా గందరగోళ పెట్టేయసాగాయి. తన భర్త ఓపక్క తనకి కలలంటూ ఏం ఉంటాయని చిన్న చూపు చూస్తున్నాడన్న బాధ, మరోపక్క అతని మాటలో నిజం ఎంత ఉందన్న ఆలోచన. తన కలలన్నీ అతగాడ్ని కష్టపెట్టేవేనా? తన కలల కోసం తను అతగాడి మీద ఆధారపడితే అంతే కదా మరి. కానీ భార్యాభర్తలన్నాక ఆనందం కోసం ఒకరిమీద ఒకరు ఆధారపడడంలో ఎంత తృప్తి ఉంటుంది. తన కలల్ని సాకారం చేయడంలో అతగాడికి సంతోషంలేదు అన్న సమాధానమే వచ్చింది కామేశ్వరికి. భార్యామణి కోరికని తీర్చగలిగినప్పుడు అతగాడి కళ్లల్లో మెరుపులు బోలెడన్నిసార్లు చూసింది. మరి ఆ మెరుపులకు అర్థం ఏమిటి? పెళ్లాం సంతోషపడుతోందన్న ఆనందమా? చూడు నేనెంత ధీరుణ్ణో, నీ కోరిక తీర్చానన్న ఆనందమా? ఒక్క నిముషం కామేశ్వరికి కొత్త అనుమానం వచ్చింది. రెండింటి కలయికా ఉందన్న అనుమాన నివృత్తి అయింది. కానీ రెండోదాని నిష్పత్తి కాస్తంత తక్కువగా వున్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు తన బాధంతా తనకి కలలేమిటి అన్నాడని! కూతురేమో కలలు కనడమే జీవితానికి ఆయువుపట్టు అంటోంది. భర్తేమో నీకింక కలలు కనడానికి ఏముంది? ఏవో చిన్న చిన్నవి తప్ప అంటూ ఎగతాళి చేస్తున్నాడు. కామేశ్వరి ఆలోచనల్లో పడి కొట్టుకుపోతోంది. మౌనంగా ఉన్న తల్లిని కుదుపుతూ అంది కైలాస.

"అమ్మా! ఎక్కడికి వెళ్లిపోయావ్? కలలోకా? ''

"అమ్మవి కలలు కావనీ, డిమాండ్స్ అనీ చెప్పానా? అమ్మవేకాదు, అమ్మలాంటి ఆడవాళ్లందరివీ డిమాండ్సనే అంటాను. కలంటే వాటిని తీర్చుకోవడం కోసం కలగన్న వాళ్లు. కష్టపడితేనే అది కలవుతుంది'' ఆడవాళ్ల కలలకి కొత్త నిర్వచనం చెబుతూ మళ్లీ నవ్వాడు పరాంకుశం.

"రోజంతా ఇంట్లో మీ కోసమే కాచుక్కూర్చోవాలన్నప్పుడు మాకు కలలు కనడానికి, వాటిని నిజం చేసుకోవడానికి టైమెక్కడిది?'' అంది.

"అబ్బో... ఇది వంకండీ'' ఎద్దేవా చేసాడు.

ఇక తను స్తబ్దుగా అయిపోయాను అన్న విషయం మర్చిపోయి భర్త తన మీద విసురుతున్న బాణాల గురించి ఆలోచించడం మొదలుపెట్టింది కామేశ్వరి. ఆ మాటల్లో ఎంతవరకు నిజం ఉంది?

"పొద్దున్న లేచినప్పటినుంచీ రాత్రి నిద్రపోయేవరకూ స్త్రీ భర్తకోసం, పిల్లలకోసం తాపత్రయపడుతున్న మాటని మీరు అంగీకరిస్తారా?''

"భర్త కోసం, పిల్లలకోసం స్త్రీ తాపత్రయపడుతున్నమాట నిజమే! కానీ దానికీ రోజంతా అవసరంలేదని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు నిరూపిస్తున్నారు'' అన్నాడు పరాంకుశం.

"పిల్లల్ని చూసుకోవడానికి ఇంట్లో ఏ పెద్దవాళ్లో, బేబీకేర్ సెంటర్లో ఉండడంవల్ల వాళ్లు ఉద్యోగాలు చేయగలుగుతున్నారు."

***

ఆ తరువాత రెండుమూడురోజులు దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయింది కామేశ్వరి. తన పతిదేవుడు తన గురించి ఈరకంగా వ్యాఖ్యానించాడు అంటే తాను ఎక్కడో సమయాన్ని వ్యర్థం చేస్తోందన్న అభిప్రాయం ఆయనకు ఉంది అనిపిస్తోంది. తనమీద ప్రేమలేక కాదు, తన కోరికలు తీర్చడంలో ఆయనకి ఆనందం లేకా కాదు. భార్యామణి ఆలోచనలో పడిపోవడం పరాంకుశం దృష్టిని దాటిపోలేదు. మరీ అంత సీరియస్ అయిపోతుందని అతగాడు అనుకోలేదు. అమ్మో... ఇక తన కావుడు నుంచి డిమాండ్సేవీ ఉండవా ఏమిటి? కావుడు ఏదయినా కోరుకోవడం, తను ఆ కోరిక తీర్చడం, కావుడి కళ్లల్లో మెరుపులు చూడడం... ఇవి లేకుండాపోతే జీవితంలో థ్రిల్లేదీ? కావుడి కోరిక తీర్చగలిగినప్పుడు తనమీద తనకి కలిగే గొప్ప భావం, అది లేకపోతే లైఫ్‌లో ఇక లైఫేం ఉంటుంది?

కానీ ఇప్పటి కావుడి సీరియస్‌నెస్ చూస్తుంటే ఇకమీదట అన్నీ కలలే కనేలా ఉంది. అమ్మో.. అలాగయితే ఎలా? కల అన్న పదానికే కొత్త అర్థం చెప్పి తను తప్పు చేసాడేమో? 'నా కావుడూ! నీ కోరికల్ని తీర్చడమే ఈ పరాంకుశం కల. కలలు కనే అదృష్టం నాకే దక్కించు ప్రియా!' అని ప్రాధేయపడ్డాడు. ఊహూ... కామేశ్వరి సీరియస్నునెస్సు తగ్గలేదు. ఆమె తన పతిదేవుడు చేసిన ఎద్దేవా గురించే ఆలోచిస్తోంది. తన పతిదేవుడు చెప్పింది అక్షరసత్యమనే ఆమె అభిప్రాయపడుతోంది. తను మనఃస్ఫూర్తిగా సంకల్పించుకుంటే చేయగలిగే తను ప్రయత్నించకుండా వున్న పనులేమైనా ఉన్నాయా? నిర్లక్ష్యం చేస్తున్న సందర్భాలేమైనా ఉన్నాయా?

ఇంటి పనులన్నీ గబగబా ఓ పద్ధతి ప్రకారం తెముల్చుకుంటే ఖాళీ సమయం దొరుకుతుందేమోననిపించింది. నలుగురితో కబుర్లు చెప్పుకోవడం కూడా జీవితంలో ఓ భాగమే. కానీ అది మరీ ఎక్కువయిపోకూడదు. మిగిలిన సమయాన్ని తను కలలు కనడం కోసం, వాటిని సాకారం చేసుకోవడంకోసం ఉపయోగించుకోవచ్చు. కలలు అనేవి ఖచ్చితంగా డబ్బు సంపాదనతోనే ముడిపడినవయి ఉండనక్కర్లేదు. కానీ డబ్బు కూడా జతయి ఉంటే ఆ ఆనందమే వేరు. కామేశ్వరి తన కలల జాబితా తయారు చేయడం మొదలుపెట్టింది. అందుకు కూతురి సహకారం కూడా తీసుకుంది. ఎప్పట్లోపు, ఎలా ఆ కలల్ని తీర్చుకునే వీలుంది? అందుకు తనని తను ఎలా సంసిద్ధ పరచుకోవాలి, మార్చుకోవాలి? మెరుగుపరచుకోవాలి? అన్న విషయాల గురించి కూతురితో చర్చించడం మొదలుపెట్టింది.


తల్లీకూతుళ్లు ఊరికే గంటల తరబడి గదిలో తలుపులు మూసుకుని గుసగుసలాడుకుంటూ కూర్చోవడం, కామేశ్వరి ఓ పెన్నూ, బుక్కు పట్టుకుని తిరగడం పరాంకుశానికి ఏం జరుగుతుందో అర్థం కాక పిచ్చెక్కుతున్నట్లుగా ఉంది. కొంపదీసి తనన్న మాటకి మనస్సులో రగిలిపోతూ విప్లవ వనితలా విడాకులు ఇవ్వడానికి ప్లాను వేయడంలేదుకదా? ఇలాంటి ఆలోచనకి కూతురు కైలాస సహాయం కూడానా? ఇద్దరూ యమా సీరియస్‌గా మొహాలు పెట్టేసుకుని కూర్చుంటేనే పరాంకుశానికి గుండెల్లో రైళ్లు పరుగెట్టడం మొదలుపెట్టాయి. పరాంకుశం టెన్షన్ చూస్తుంటే కామేశ్వరికి ముచ్చటగా అనిపించి ఇంకొంచెం ఏడిపించాలనిపించింది. కానీ కైలాసకి తండ్రి మీద జాలివేసి అసలు విషయం చెప్పేసింది. ఇక అప్పట్నుంచీ పరాంకుశానికి ఇంకో టెన్షన్ మొదలయింది. కావుడి కలల లిస్టు మరీ పెద్దగా కనిపిస్తోంది. అందులో ఎలాంటి కలలు ఉన్నాయో అని తెలుసుకోవాలన్న తహతహ మొదలయింది. అన్ని కలలు ఏమయి ఉంటాయబ్బా... చాలామటుకు తను తీర్చేశాడే? అడిగితే కామేశ్వరి ససేమిరా చూపించనంది.

***

కామేశ్వరి ఎటూ తేల్చుకోలేకపోతోంది. సతమతమయిపోతోంది. తనకయితే శంకరంగారు చెప్పింది ఇష్టంగానే అనిపించింది.


"అమ్మాయ్! పరమానందస్వాములవారు హిమాలయాల నుంచి వచ్చారు. నీకు భక్తిభావం ఎక్కువని చెబుతున్నాను. మీ ఇంటికి ఆహ్వానించి ఆశీర్వాదం పొందితే అన్నీ శుభాలు జరుగుతాయి."

కామేశ్వరికి స్వాములవారిని ఆహ్వానించాలని ఉంది. ఎందుకంటే అసలే తన జీవితాన్ని ఓ కొత్త పంథాలోకి మార్చుకోవాలనుకుంటోంది. ఇటువంటప్పుడు అలాంటి మహానుభావుల ఆశీర్వాదం తీసుకోవడం మంచిది కదూ! కానీ సమస్య ఏమిటంటే పరాంకుశానికి ఇటువంటి విషయాలమీద అంతగా ఆసక్తిలేదు. గుడికి వెళ్లి భగవంతుడికి నమస్కరించుకుంటే ఆయనే నిన్ను



## నటనంటే విసుగేస్తోంది!!

మమతా మోహన్‌దాస్‌కి డైటింగ్ సమస్య చిరాకు తెప్పిస్తోందిట. 'కృష్ణార్జున' సినిమాలో విష్ణుకి జంటగా నటించిన మమతా మోహన్‌దాస్ ఇందులో విష్ణుకి కాస్త దీటుగా కనిపించేలా కొంచెం బొద్దుగా వుండాలని భావించిన దర్శకుడు కొంచెం బరువు పెరుగమ్మా అని సూచించాట్ట. సరేలే అన్న ఆమె మరో సినిమా కోసం నాజూగ్గా తయారుకావాల్సి వచ్చిందిట. వెంట వెంటనే ఇలా లావై, సన్నబడ్డం అంటే తేలికైన విషయం కాదు, కదా! అందుకే సినిమా నటన అంటే విసుగొస్తోందిట ఆమెకి.




కాపాడతాడు అంటాడు. ఫోన్ చేసి విషయం చెబితే కస్సుమన్నాడు. నాలు గైదుసార్లు ఫోన్ చేసి ఒప్పించడానికి ప్రయత్నించింది. ఊహూ... వినలేదు.

'ఇంకొక్కసారి ఫోన్ చేసి ప్రయత్నిస్తాను. కాదంటే ఎదురు తిరుగుతాను. చేస్తున్నది మంచి పనేగా' అనుకుంది. శంకరంగారు తీసుకువచ్చారంటే ఆయన నిజంగానే మహానుభావులయి ఉంటారు.

"మీ పర్మిషన్ కోసం కాదు ఫోన్ చేసింది. మీకు ఇష్టం ఉంటే రండి. లేకపోతే మానేయండి" అని గబగబా పరాంకుశానికి చెప్పేసి అన్ని ఏర్పాట్లు గబగబా చేసుకుని శంకరంగారి ఇంటికి వెళ్లి స్వామివారిని సాదరంగా ఆహ్వానించింది. సత్కారాలు, ఆశీర్వాదాలు అయ్యాక స్వామివారు అన్నారు.


"ప్రస్తుత నీ జీవిత గమనంలో కొన్ని ముఖ్యమైన మార్పులు చేసుకోవాలనుకుంటున్నావుకదూ"

"అవును స్వామీ. నేను 'కల'లు కని వాటిని సాకారం చేసుకోవాలనుకుంటున్నాను" కామేశ్వరి కలని వత్తి పలుకుతూ అంది.



## నాగార్జున స్టయిలే వేరు!

మాస్, బాస్, డాన్... ఈమధ్య నాగార్జున సినిమా టైటిళ్లన్నీ ఇలా రెండక్షరాలవే ఎక్కువుంటున్నాయి. తాజాగా ఆయన నటించబోయే సినిమా పేరు 'కింగ్'. శ్రీను వైట్ల దర్శకత్వం వహించే ఈ సినిమా గురించిన వివరాలను చాలా రహస్యంగా వుంచుతున్నారు. అయితే నిన్నమొన్నటి వరకూ (కృష్ణార్జున సినిమాలో సైతం) పొడుగాటి హెయిర్ స్టయిల్‌తో కనిపించిన నాగ్ ఈ కొత్త చిత్రంలో పొట్టి హెయిర్ స్టయిల్‌తో కనిపించవచ్చునే తాజా కబురు. ఏదేమైనా గెటప్ విషయంలో నాగ్ స్టయిలే వేరు కదా!




"ఏవీ... మచ్చుకు చెప్పు" స్వామివారన్నారు.

"మావారికి ప్రమోషన్ రావాలి. అమ్మాయికి మంచి వరుడు రావాలి" కామేశ్వరి ఇంకా ఏదో చెప్పబోయేంతలో స్వామివారు అడ్డుపడ్డారు.

"ఈ కోరికలో ప్రత్యేకతలు ఏముందమ్మాయ్. అందరూ కోరుకునేవే"

"ఇంకా ఉన్నాయి వినండి స్వామీ. మావారికి మరీ భారంగా అనిపించకుండా నా సరదాలు నేనే తీర్చుకోవడానికి డబ్బు సంపాదించడం నా కల. ఒక్క సంపాదనలో సరదాలన్నీ తీరడం సాధ్యంకాదు. నేనేకాదు, నాలాంటి ఆడవాళ్లందరినీ నాలా ఆలోచించేలా జాగృతం చేయాలనుకుంటున్నాను. నా ఖాళీ సమయాన్ని కొంత డబ్బుగా మార్చాలనుకుంటున్నాను. నా ఖాళీ సమయంలోని మరికొంత సమయం ఇంకొకరి జీవితంలో వెలుగుగా మారాలన్నది మరో కల" కామేశ్వరి మనస్ఫూర్తిగా చెప్పింది.

స్వాములవారు కళ్లొత్తుకున్నారు గుండె ఆర్ద్రమయిపోతుండగా.

"ఇంకొకరి జీవితంలో వెలుగు నింపడానికి ఏం చేద్దామనుకుంటున్నావు?'

"మా రోడ్డుకి అటువైపు పూరిగుడిసెల్లో నివసించే జనం బోలెడుమంది ఉన్నారు స్వామీ. వాళ్ల జీవితాల్లో ఎన్నెన్నో చీకటికోణాలు. ఉదాహరణకి భర్త తాగి వచ్చి భార్యని కొట్టడం, పిల్లల్ని ఇంగ్లీషు మీడియం చదువులకి పంపించి వాళ్లేం చదువుతున్నారో చూసుకోలేకపోవడం! ఆ చీకటి కోణాల్లో వెలుగు నింపడానికి ప్రయత్నిస్తాను. ఆ తృప్తి అద్భుతం."

"ఇంతకీ సరదాలేవో తీర్చుకోవాలన్నావ్. ఆ సరదాలేమిటమ్మాయ్?"

"సరదాలా! చాలా ఉన్నాయి స్వామీ. అవ్వన్నీ వినడానికి మీకు సమయం ఉండదేమో! ఇది నా కలల జాబితా స్వామీ. మీరు విమానంలో కూర్చున్నాక ఒక్కొక్కటీ చదివి ఒక్కోదానికి ఒక్కో ఆశీర్వాదం ఇవ్వండి స్వామీ" ఓ కాగితం మడత అందించింది కామేశ్వరి.

స్వాములవారు ఆ కాగితాన్ని అందుకుని సంచీలో వేసుకున్నారు.

"చివరగా నాకింకో కల స్వామీ" కామేశ్వరి తెగ సిగ్గుపడిపోతూ అంది.

"ఏమది?"

"నా పతిదేవుడికి నటనంటే చాలా ఇష్టం స్వామీ. ఆయనకో కోరిక వుంది టీవీలో నటించాలని. ఆ కోరిక కూడా సిద్ధించేలా ఆశీర్వదించండి స్వామీ. ఆయనకి బోలెడంత టాలెంట్ ఉంది."

"సిద్ధిరస్తు. కానీ అమ్మాయ్! నీ కలల గురించి నువ్వు కష్టపడతానంటున్నావు. వాళ్ల కోరికలు మాత్రం సిద్ధించేలా ఆశీర్వదించమంటున్నావు. నీ కలల సాకారం అయ్యేలా చేయమని కోరుకోవా?"

"అదేమిటి స్వామీ! వాళ్ల కోరికలు తీరడమే నా మొదటి కల" కళ్లల్లో మెరుపుల కురుస్తుండగా అంది కామేశ్వరి.

"కావుడూ!" కళ్లల్లోంచి నీళ్లధారలు కట్టేస్తుండగా గడ్డాలు, మీసాలు పీకి పక్కకి విసిరేసి కావుడ్ని కౌగలించుకున్నాడు పరాంకుశం. "నీ కలల్ని అవమానించాను, చిన్నబుచ్చాను. క్షమించు కావుడూ"

ఒక్కక్షణం నివ్వెరపోయిన కామేశ్వరి కాస్సేపటికి తెప్పరిల్లింది.

"ఫర్వాలేదులెండి. ఈ కామేశ్వరి కల పవరేంటో చూద్దురుగాని" పరాంకుశం బుగ్గలమీంచి కారిపోతున్న కన్నీటిని తుడుస్తూ అంది కామేశ్వరి.

శంకరం మాత్రం "ఇదంతా మీ ఆయన బలవంతం మీదనే చేసానమ్మాయ్" అని చెప్పి అక్కడ్నించి చల్లగా జారుకున్నాడు.

కామేశ్వరికి మాత్రం తన కల దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించింది. తనే కాకుండా తన వెనుక వందలాదిమంది ఆడవాళ్లని కలలు కనేలా చేసి వాటిని సాకారం చేసుకునే మార్గం చూపిస్తూ ముందుకు సాగిపోతూ ఉంది కామేశ్వరి కల!

★